సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

epaper.manachourasta.com

మన చౌరాస్తా

The Complete News way

2 లో

ప్రమాణం చేసిన ఎల్కతుర్తి మార్కెట్ కమిటీ

సంపుటి : 02 | సంచిక : 127 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | గురువారం | 11.09.2025

ఉపాధ్యాయులే..

మార్గదర్శకులు

- ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ బాధ్యత టీచర్లదే..
- శాసన మండలి సభ్యుడు పింగిలి శ్రీపాల్ రెడ్డి
- జనగామలో ఘనంగా గురుపూజోత్సవం

2

ఉపాధ్యాయులే సమాజానికి మార్గదర్శకులని, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ బాధ్యత వారిపైనే ఉందని శాసన మండలి సభ్యుడు పింగిలి శ్రీపాల్ రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని కాన్ఫెరెన్స్ హాల్ లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గురుపూజోత్సవం కార్యక్రమాన్ని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్, డీఈఓ పింకేష్ కుమార్‌తో ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

- మన చౌరాస్తా, జనగామ

4 లో

నవంబర్ 10 నుంచి 23వరకు

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- ఆర్మీ, పోలీస్, రెవెన్యూ అధికారులతో సమీక్ష

వీరనారి చాకలి ఐలమ్మ

అందరికీ ఆదర్శం

- జిల్లా వ్యాప్తంగా వర్ధంతి కార్యక్రమాలు
- నివాళులర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు

3

ఉపాధ్యాయులే.. మార్గదర్శకులు

- **ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ బాధ్యత టీచర్లదే..**
- **ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి**
- **జనగామలో ఘనంగా గురుపూజోత్సవం**

జనగామ, మన చౌరాస్తా : ఉపాధ్యాయులే సమాజానికి మార్గదర్శకులని, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ బాధ్యత వారిపైనే ఉందని శాసన మండలి సభ్యుడు పింగిలి శ్రీపాల్ రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని కాన్ఫెరెన్స్ హాల్ లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గురుపూజోత్సవం కార్యక్రమాన్ని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్, డీఈఓ పింకేష్ కుమార్‌తో ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయుల చేతిలో ఉంటుందన్నారు. విద్య ప్రమాణాలను పెంచడం లో ఉపాధ్యాయులు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాల లను పరిరక్షించే బాధ్యత ఉపాధ్యాయుల చేతిలో ఉందన్నారు. వచ్చే పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాకు మొదటి స్థానం వచ్చేలా ఉపాధ్యాయులు, విద్యార్థులు కష్ట పడాలన్నారు. గుణాత్మక విద్య అందించాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు అప్ డేట్ అవ్వాలన్నారు. కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థానం గురువుకు ఇస్తామని, విద్యార్థులను జ్ఞానవంతులుగా తీర్చిదిద్దడంలో ఒక గురువు కృషి వెలకట్టలేనిదన్నారు. అన్ని స్థాయిలో విద్యార్థులను గైడ్ చేస్తూ.. వారి భవిష్యత్ కి బంగారు బాటలు వేయాలన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందించడం లో జిల్లా లోని అందరూ ఉపాధ్యాయులు కష్ట పడుతున్నారన్నారు. దేశ, రాష్ట్ర స్థాయిలో జిల్లాకి వచ్చిన పేరును కాపాడుతూ ముున్ముందు మరిన్ని అంశాలలో జిల్లాను ముందంజలో నిలబడేలా ఉపాధ్యాయులు ముఖ్య భూమిక పోషించాలన్నారు. వివిధ అంశాలలతో రూపొందించిన దిక్సూచి కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేస్తే జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు నమోదు గణనీయంగా పెరుగుతుందన్నారు. ప్రీ ప్రైమరీ స్కూల్ నుంచి మొదలుకొని అన్ని స్థాయిల్లో విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం దిశా నిర్దేశం చేస్తుందన్నారు. అదనపు కలెక్టర్, డీఈఓ పింకేష్ కుమార్ మాట్లాడుతూ ఎస్ఏఎస్‌లో కలెక్టర్ ప్రత్యేక దృష్టి వల్ల జిల్లా టాప్ 50 లో స్థానం సంపాదించడం జరిగిందన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు దిక్సూచి లాంటి కార్యక్రమాలను రూపొందించడం జరిగిందన్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రధానోత్సవం, అలాగే అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నాటక ప్రదర్శనలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో ఆర్డీఓ గోపీరామ్, ఏడీ సత్యనారాయణ మూర్తి, ఆర్టీఏ సభ్యుడు అభిగౌడ్, మహాత్మా గాంధీ హెల్పింగ్ హ్యాండ్ వ్యవస్థాపకుడు గంటా రవీందర్, వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారం

ఎల్కతుర్తి, మన చౌరాస్తా : ఎల్కతుర్తి కేంద్రంగా ఏర్పడిన వ్యవసాయ మార్కెట్ కమిటీ తొలి పాలకవర్గం బుధవారం నాడు ఘనంగా ప్రమాణస్వీకారం చేసింది. మండలానికి చెందిన చింతలపల్లి గ్రామానికి చెందిన సుఖినే సంతాజి చైర్మన్‌గా, ముస్తాపూర్ గ్రామానికి చెందిన బొక్కల స్రవంతి వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్లుగా కేశవాపూర్‌కు చెందిన అబ్బానవేన రాజయ్య, ఎల్కతుర్తికి చెందిన గొడిశాల రాజయ్య, పెంచికలపేటకు చెందిన దాట్ల ప్రవీణ్, సూరారంకు చెందిన బచ్చు బాపురావు, దామెరకు చెందిన మంతుర్తి రాజయ్య, ముల్కనూరుకు చెందిన గణబోయిన కొమురయ్య, పంగరకు చెందిన రామోజు మొండయ్య, కొత్తకొండకు చెందిన జోడుముంతల వెంకటస్వామి, ముల్కనూరుకు చెందిన షేక్ హకీమ్ పాషా, ఎర్రబెల్లికి చెందిన మాలోతు జగన్, జీలుగులకు చెందిన బండి సుధాకర్ ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో పాటు పి.ఏ.సీ.ఎస్ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, వ్యవసాయ సహాయ సంచాలకులు, ఎల్కతుర్తి గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి డైరెక్టర్లుగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ సుకినే సంతాజి మాట్లాడుతూ, "రైతు ప్రయోజనాలే మా కమిటీకి ప్రధాన లక్ష్యం. రైతులకు అవసరమైన సేవలను ఎల్లప్పుడు అందుబాటులో ఉండేలా పనిచేస్తాం. 24 గంటలూ రైతుల కోసం పని చేసి, వారి సమస్యలను పరిష్కరించడమే మా ధ్యేయం" అని తెలిపారు. ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరైన పలు పార్టీల నాయకులు, అధికారులు నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. రైతులకు అందుబాటులో ఉండేలా పారదర్శకంగా సేవలు అందించాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం ద్వారా ఎల్కతుర్తి మార్కెట్ కమిటీ ప్రాంత రైతులకు మరింత ఉపయోగకరంగా మారుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఐలమ్మ మహిళా లోకానికి స్ఫూర్తి : శ్రీనివాస్

కొమురవెల్లి, మన చౌరాస్తా : నైజాం నిరంకుశ పాలనకు ఎదురొడ్డి పోరాడిన మహా యోధురాలు ఐలమ్మ అని ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో కొందరు మహనీయులు స్వతంత్ర పోరాటం కోసం రంగంలోకి దిగితే, కొందరు సామాజిక న్యాయం కోసం పోరాటం చేశారని, అలాంటి వారిలో వీరనారి ఐలమ్మ కూడా ఒకరిని మహదేవుని శ్రీనివాస్ అన్నారు. చాకలి ఐలమ్మ త్యాగాలు మరువలేనివని, బడుగు వర్గాల ఉన్నతికి ఆమె ఎంతో కృషి చేశారని ప్రశంసించారు. సేవా తత్పరతకు, త్యాగ నిరతికి కులాలు, మతాలతో సంబంధం ఉండదని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఆనాటి చాకలి ఐలమ్మ కాలం నుంచి నేటిదాకా దేశం కోసం నడుము కట్టిన మహిళా మనులు ఎందరో ఉన్నారని అన్నారు. చట్టసభలలో 33 శాతంమహిళా రిజర్వేషన్ అమలు తేవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి పోరాటంలోనూ బీసీల పాత్ర ఉందని, కానీ ప్రతి చోటా బీసీలు వెనుకబడి ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల భవిష్యత్తు కోసం నిరంతర పోరాటం చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

ఐలమ్మ అందరికీ ఆదర్శం

- దొరలను ఎదురించిన ధీశాలి
- రజాకార్లను తరిమికొట్టిన వీర వనిత
- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగామ, మన చౌరాస్తా : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శమని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ అదనపు కలెక్టర్ బెన్న లోమ్ తో కలిసి పాల్గొని ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన చాకలి ఐలమ్మ సేవలు మరువలేనివి అన్నారు. తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరమాత, సామాజిక ఆధునిక పరిణామానికి నాంది పలికిన స్త్రీ ధైర్యశాలి అని కొనియాడారు. ఐలమ్మను ఆదర్శంగా తీసుకుని ఆమె ఆశయాల సాధనకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఆమె ధీర చరిత్ర ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొంది ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల జిల్లా అభివృద్ధి అధికారి నరసింహ రావు, జనగామ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, చాకలి ఐలమ్మ మనవడు చిట్యాల సంపత్, మనవరాలు శ్వేత, జనగామ జిల్లా టౌన్ రజక సంఘం గౌరవ అధ్యక్షుడు నర్సింహులు, బీ ఆర్ఎస్ జనగామ పట్టణ యూత్ అధ్యక్షుడు ఉల్లెంగుల సందీప్, బీఆర్ ఎస్ పార్టీ టౌన్ వైస్ ప్రెసిడెంట్ ఉల్లెంగుల నర్సింగ్, నాయి బ్రాహ్మణ సంఘ కార్యదర్శి అవినాష్, బీసీ సంఘం అధ్యక్షుడు వీరస్వామి, బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ జాయ మల్లేష్, దిశా కమిటీ సభ్యుడు శ్రీనివాస్, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఐలమ్మ జీవితం నేటి తరానికి
స్ఫూర్తిదాయకం

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందే అశోక్

చేర్యాల, మన చౌరాస్తా : చాకలి ఐలమ్మ జీవితం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని, ఆమె పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు నిర్మిస్తామని సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందే అశోక్ అన్నారు. బుధవారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో చేర్యాల పట్టణంలోని అంగడి బజార్ వద్ద ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భూమి కోసం, భుక్తికోసం, వెట్టి చాకిరి విముక్తికోసం నిజాం నిరంకుశ పాలనపై తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తెగువతో పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అని అన్నారు. మొక్కవోని ధైర్యంతో తన ఇంటినే కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంగా మార్చి ఎందరో పోరాట వీరులకు అండగా నిలబడి ఉద్యమాన్ని పదునెక్కించిన గొప్ప వ్యక్తి ఐలమ్మ అని ఆమె సేవలను కొనియాడారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, మండల సహాయ కార్యదర్శి కత్తుల భాస్కర్ రెడ్డి, డివిజన్ నాయకుడు వలబోజు నర్సింహా చారి, మండల కోశాధికారి నంగి కనకయ్య, కార్యవర్గ సభ్యులు పొన్నబోయిన మమత, సుంకోజు రజిత, మీస సత్యనారాయణ, సుంచు అశోక్, తుప్పతి రాజు, తుప్పతి కనకయ్య, సిరిగిరి రాజు, మల్లయ్య, రాములు,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ పోరాట స్ఫూర్తితోనే..
ఇండ్ల పోరాటాలు

సీపీఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి

జనగామ, మన చౌరాస్తా : భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకి విజ్ఞప్తి కోసం వీరోచితంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ఐలమ్మ పోరాటం స్ఫూర్తితో జనగామ జిల్లాలో ఇండ్ల పోరాటం నిర్వహిస్తామని మోపు కనకారెడ్డి అన్నారు. జనగామ పట్టణంలో సీపీఎం జిల్లా కార్యాలయంలో చిట్యాల ఐలమ్మ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమానికి పార్టీ జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా మోకు కనకారెడ్డి పాల్గొని మాట్లాడారు. విస్నూరు దేశముఖ్ రాపాక రామచంద్రారెడ్డి ఆగడాలను వ్యతిరేకిస్తూ దగా పడుతున్న పేద ప్రజలకు అండగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ నడుం బిగించిందన్నారు. ఉద్యమం అన్ని తరగతుల ప్రజలను ఐక్యం చేసి పోరుబాలు నడిపిన వర్గ పోరాటం 3వేల గ్రామాలకు ఉద్యమం విస్తరించిందన్నారు. 10 లక్షల ఎకరాల భూమిని రైతాంగం స్వాధీనం చేసుకున్నారని వివరించారు. ఆంధ్ర మహాసభ స్ఫూర్తితో కమ్యూనిస్టు నాయకుల పంటతో పంటలను కాపాడుకొని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఐలమ్మ కీర్తి బావుటగా నిలిచిందన్నారు. ఐలమ్మ స్ఫూర్తితో జనగామ జిల్లాలలో ఇండ్ల స్థలాల కోసం పోరాటం నిర్వహిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఎర్రజెండా నిలబడుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, జిల్లా కమిటీ సభ్యులు బోడ నరేందర్, భూక్యా చందు నాయక్, ఎండి అజారుద్దీన్, పట్టణ కమిటీ సభ్యులు బాల్య వెంకట మల్లయ్య, కళ్యాణం లింగం, నాయకులు ఎదునూరి మదర్, వెంకటేశు, శాఖ కార్యదర్శిలు ఎండి గౌసియా, జయ, అండాలు, బాలమణి, మల్లేష్, రాజ్, నాగరాజు, స్వామి, సత్తయ్య, వరలక్ష్మి, బండ రమాదేవి, ఎర్ర అనిత, మమత పాల్గొన్నారు.

వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళి

పాలకుర్తి, మన చౌరాస్తా : రైతాంగ హక్కుల కోసం కష్టాలనెదుర్కొని అణగారిన వర్గాల గౌరవాన్ని నిలబెట్టిన వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని పాలకుర్తిలో నిర్వహించారు. రాజీవ్ చౌరస్తా వద్ద ఐలమ్మ విగ్రహానికి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి పూల మాలేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతు హక్కుల కోసం చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం నేటికీ స్ఫూర్తిదాయకమన్నారు. బ్లాక్ అధ్యక్షత సత్యనారాయణ, మండలాధ్యక్షుడు కుమారస్వామి, ఎర్రబెల్లి రాఘవ రావు, యాకయ్య, ఐలమ్మ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో నివాళి

కొమురవెల్లి, మన చౌరాస్తా : వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ గారి 40వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు అనంతరం కొమురవెల్లి సిపిఎం పార్టీ కార్యాలయంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి తాడూరు రవీందర్ గారు మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం బాంచన్ దొర అనే నోటితోనే బందుకులు చేత పట్టించి దొరలకు ఎదురు నిలిచి పోరాటం చేసిన వీరనారి వీర వనిత చాకలి ఐలమ్మ ఆమె పండించిన పంటలను విస్నూర్ రాంచంద్రారెడ్డి దొర తన దగ్గర పనిచేసే మనుషులను పంపి తను పండించిన పంటను దోచుకొని రమ్మని చెప్పక ఆనాడు కమ్యూనిస్టు పార్టీ అండతో ఎర్రజెండా చేతపట్టుకొని అందరిని ఏకం చేసి దొరలను తరిమికొట్టిన గొప్ప ధైర్యశాలి వీరనారి వీర వనిత చాకలి ఐలమ్మ అని ఆమె పోరాట స్ఫూర్తితో పోరాటాలను చేయాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఉల్లంపల్లి సాయిలు ఆరుట్ల రవీందర్ తాడూరి నరేష్ చింతల ఇంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

పాలకుర్తి, మన చౌరాస్తా : పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. 56 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 56,06,496 విలువైన చెక్కులను పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేద కుటుంబాల ఆర్థిక భారం తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరేలా కృషి చేస్తున్నమని తెలిపారు.

Varsha Digitals
8555800812
ఈ-పేపర్ డిజైనింగ్ చేయబడును.

నవంబర్ 10నుంచి 23వరకు

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- ఆర్మీ, పోలీస్, రెవెన్యూ అధికారులతో సమావేశం

హనుమకొండ, మన చౌరాస్తా : ఆర్మీలో చేరేందుకు గత కొన్ని నెలల క్రితం ఆన్లైన్ విధానంలో పరీక్ష నిర్వహించగా అందులో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు హనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో నవంబర్ 10నుండి 23వ తేదీ వరకూ ఆర్మీ రిక్రూట్ మెంట్ ర్యాలీని ఆర్మీ అధికారులు నిర్వహిస్తారని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పరీక్ష ఉత్తీర్ణులైన అభ్యర్థులకు నిర్వహించనున్న ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ గురించి ఆర్మీ అధికారులు జిల్లా కలెక్టర్, వివిధ శాఖల అధికారులతో సమావేశమై ర్యాలీ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ లోని ఆర్మీ రిక్రూట్మెంట్ కల్నల్ సునీల్ యాదవ్ మాట్లాడుతూ ఆర్మీలో అగ్ని వీర్ నియామకాల కోసం గతేడాది హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియంలో ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీని నిర్వహించినట్లు చెప్పారు. ఈసారి హనుమకొండ లోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఆర్మీలో అగ్ని వీర్ ల నియామకాల ఇప్పటికే దరఖాస్తు ఆన్లైన్ విధానంలో నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 9వేల మంది వరకు అభ్యర్థులు పరీక్షలో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఉత్తీర్ణులైన అభ్యర్థులకు రన్నింగ్ టెస్ట్ తో పాటు శారీరక సామర్థ్య పరీక్షలు, మెడికల్ టెస్ట్, విద్యార్హతల ధ్రువ పత్రాలను పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. నవంబర్ 10 నుండి 23వ తేదీ వరకు జరగనున్న ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీని విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం తోడ్పాటునందించాలని అన్నారు. ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలను తెలియజేస్తూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్, వివిధ శాఖల జిల్లా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ నవంబర్ 10 నుండి 23వ తేదీ వరకు జరగనున్న ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీకి వివిధ శాఖల సమన్వయంతో అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తామని ఆర్మీ అధికారులకు వివరించారు. రాష్ట్రంలో గతేడాది హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించగా ఈ ఏడాదిలో హనుమకొండ జిల్లాలో ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీని నిర్వహించే అవకాశం దక్కడంతో విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం తరఫున అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, ఆర్మీ మేజర్ ప్రకాష్ రాయ్, ఆర్మీ అధికారులు గురు దయాల్ సింగ్, సుభాష్, వి.వి. నాయుడు, వినోద్ కుమార్ శర్మ, మనీష్ కుమార్, ఆర్డిఓ రాథోడ్ రమేష్, డిఆర్డిఓ మేన శ్రీను, డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, సిపిఓ సత్యనారాయణ రెడ్డి, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, స్పోర్ట్స్ అధికారి అశోక్ కుమార్, హనుమకొండ ఏసిపి నరసింహారావు, మేరా యువభారత్ డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్ పాల్గొన్నారు.

రియాద్‌లో తెలుగు యువకుడి అస్వస్థత

- కోమాలో ఉన్న యువకుడిని తరలించేందుకు మంత్రి పొన్నం చొరవ

భీమదేవరపల్లి, మన చౌరాస్తా : హుస్నాబాద్ నియోజకవర్గం, ఎల్కతుర్తి మండలానికి చెందిన లోకిని కృష్ణమూర్తి అనే 35 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అధిక రక్తపోటుతో మెదడులో రక్తస్రావం (హెమరేజ్) కారణంగా కోమాలోకి వెళ్లినట్లు గుర్తించారు. ప్రస్తుతం సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లోని ఎస్ఎంసీ ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. సాబ్ బ్యాంక్‌లో పనిచేస్తున్న కృష్ణమూర్తిని హైదరాబాద్‌కు తరలించేందుకు సహాయం కోరుతూ అతని తండ్రి సూరయ్య మంగళవారం ప్రజాభవన్‌లో సీఎం ప్రవాసీ ప్రజావాణిని ఆశ్రయించి వినతిపత్రం సమర్పించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ తీసుకుని, అవసరమైన సహకారాన్ని అందించేందుకు చర్యలు ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి మార్గదర్శకత్వంలో చర్యలు జరుగుతున్నాయి. పెషెంట్ భార్య తెనుగు అశ్విని ప్రస్తుతం రియాద్‌లో ఉండగా, గ్లోబల్ తెలంగాణ ఫోరం అధ్యక్షులు మహ్మద్ జబ్బార్ సమన్వయం చేస్తున్నారు. తెలుగు ప్రజలకు అండగా నిలిచేలా ప్రభుత్వం తక్షణమే సహాయాన్ని అందిస్తున్నది.

సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించిన మంత్రి పొన్నం

హుస్నాబాద్, మన చౌరాస్తా : హుస్నాబాద్ నియోజకవర్గానికి చెందిన బస్వాపూర్, సముద్రాల, పందిళ్ళ, పోతారం గ్రామాల్లో జాతీయ రహదారి పై సెంట్రల్ లైటింగ్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న స్ట్రీట్ లైట్ల కోసం నిధులు కేటాయించి ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హైమావతి, అడిషనల్ కలెక్టర్ గరిమ అగర్వాల్, డీసీసీ అధ్యక్షుడు తుంకుంట నర్సారెడ్డి, పూజల హరికృష్ణ, చెరుకు శ్రీనివాస్ రెడ్డి తదితర ప్రముఖ నాయకులు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 'కోహెడ మండలంలోని బస్వాపూర్, సముద్రాల, హుస్నాబాద్ మండలంలోని పందిళ్ళ, పోతారం గ్రామాల్లో లైట్లు ప్రారంభించడం జరిగింది. త్వరలోనే జిల్లలగడ్డ, ములకనూరు, కొత్త పల్లి, ఎలకతుర్తి ప్రాంతాల్లో సెంట్రల్ లైటింగ్ పూర్తవుతుంది. అలాగే మిగిలిన రహదారి పనులు, ఎలకతుర్తి-సిద్దిపేట రహదారి అభివృద్ధిని త్వరగా పూర్తి చేస్తాం. హుస్నాబాద్ నుండి కరీంనగర్ వరకు ఫోర్ లైన్ రోడ్డు నిర్మాణంతో పాటు సెంట్రల్ లైటింగ్ పనులు జరుగుతున్నాయి' అని తెలిపారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్లకు సన్మానం

స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా : జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మండలం చాగల్లు శివారు, శివారెడ్డి పల్లెలో గ్రామస్తులు పల్లె వెలుగు బస్సులు ఆపాలని ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ లను ఘనంగా సన్మానించారు. రిక్వెస్ట్ స్టాప్ ఉన్నప్పటికీ బస్సులు ఆగకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు ఆర్టీసీ అధికారులకు బస్సులు ఆపాలని చెప్పినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, రిక్వెస్ట్ బస్ స్టాప్ వద్ద ఆపిన డ్రైవర్, కండక్టర్ కు గ్రామస్తులు పూలదండలతో సన్మానం చేసి కృతజ్ఞతలు తెలిపారు.